ఆగిన రెడ్ మార్కింగ్..

- మూసీ రణం.. వెనక్కి తగ్గిన హస్తం
- అందరికీ డబుల్ బెడ్రూంలు అందించాకే..
- కూల్చివేతలంటూ అధికారుల దాటవేత
- ప్రజల నుంచి వ్యతిరేకత తట్టుకోలేకనే.. వెనకడుగు
- మూడో రోజు కేవలం 'డబుల్' ఇండ్ల ఆసక్తి ఉన్న వారి వివరాల సేకరణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): గుండెలు రగిలాయి.. ఆగ్రహావేషాలు పెల్లుబికాయి.. ఉప్పెనలా ఆక్రోశం ఎగిసింది. ఈ ప్రజా చైతన్యానికి కాంగ్రెస్ సర్కారు వెన్నులో వణుకు పుట్టింది. మూసీ ఇండ్లపై బుల్డోజర్లు ఏ క్షణమైనా దూసుకురావొచ్చనే హైడ్రా స్పీడుకు బ్రేకులు పడింది. రెడ్ మార్కింగ్ నిలిచిపోయింది... మూడు రోజుల నుంచి మూసీ నిర్వాసితుల ఆందోళనలు.. ఎక్కడికక్కడ సర్వే బృందాల అడ్డగింత.. రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయడం.. మార్కింగ్ వేయకుండా నిలువరించడం.. చావడానికైనా సిద్ధపడటం వంటి ఘటనలతో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిన అనివార్యత ఏర్పడింది. మూసీ నిర్వాసితుల తెగింపు చూసిన హైడ్రా, రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చివేతలు ప్రస్తుత పరిస్థితుల్లో కుదరవని ప్రభుత్వ పెద్దలకు తెలియజేసినట్టు సమాచారం. దీంతో చేసేదేమీ లేక ఇప్పటికే వచ్చిన బుల్డోజర్లు వెనక్కి వెళ్లాల్సిన దుస్థితి. అయితే, ఈ డ్యామేజీని కంట్రోల్ చేసుకోవడం కోసం రేవంత్ సర్కార్ మరో నాటకానికి తెరతీసింది. ఇప్పట్లో కూల్చివేతలు లేవంటూ.. నిర్వాసితులను ఒప్పించి అందరికీ డబుల్ బెడ్రూంలు కేటాయించిన తర్వాతే కూల్చివేతల గురించి ఆలోచిస్తామని హైడ్రా, మున్సిపల్ శాఖ అధికారులు శనివారం మీడియా సమావేశం నిర్వహించి ప్రకటించడం గమనార్హం. ఎవరిని బలవంతంగా ఖాళీ చేయించబోమని.. అందరికీ న్యాయం చేశాకే.. మూసీ ప్రాజెక్టుపై ముందుకెళ్తామని చెప్పక తప్పని పరిస్థితి వచ్చింది.

మొదట యుద్ధ జపం..

అధికారులు మొదట యుద్ధ జపం.. ఇప్పుడు శాంతి జపం చేస్తున్నారు. మూసీ నిర్వాసితుల ఇండ్లను కూల్చేస్తామంటూ సర్వే బృందాలు రెడ్ మార్కింగ్ ప్రక్రియతో హడలెత్తించారు. ఇక మీ ఇండ్లు భూస్థాపితం అవ్వబోతున్నాయనేలా భయోత్పాత వాతావరణాన్ని సృష్టించారు. పోలీసుల ఓవరాక్షన్ పలువురు బాధితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అయితే, అధికారుల తీరును మూసీ నిర్వాసితులు ఎండగట్టారు.. వారిని నిలదీశారు. దీంతో మూడో రోజు సర్వేకు వచ్చిన బృందాలు రెడ్ మార్కింగ్ ప్రక్రియను ఆపేశారు. శనివారం జరిగిన సర్వేలో అధికారులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి డబుల్ బెడ్రూమ్‌లకు వెళ్లాలనుకునే వారిని గుర్తించి వారికి పట్టాలు అందించడంపై దృష్టి సారించారు. ఇందులో అధిక సంఖ్యలో బాధితులు తమ ఇండ్లను వదిలేదే లేదని, తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు అక్కర్లేదని తేల్చి చెబుతున్నట్టు ఓ సర్వే అధికారి తెలిపారు. ఆసక్తి ఉన్న వారి వివరాలు మాత్రమే తీసుకుంటున్నామని చెప్పారు. రెడ్ మార్క్ నిలిచిపోవడంతో నిర్వాసితులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. కాగా, మూసీ ప్రాంతాల్లో ఏండ్లుగా ఉన్న వారిని తప్పించడం ప్రభుత్వానికి కత్తి మీద సాము అని చెబుతున్నారు. వారిని ఒప్పించడానికి సామాజిక కార్యకర్తలను, ఎన్‌జీఓ సంస్థలను, ఉపాధి కల్పించే సంస్థలను రంగంలోకి దింపుతున్నట్టు అధికారులు చెప్పారు. అయితే, ఇవేమీ వారిని ప్రభావితం చేయలేవని రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు. మొత్తంగా మూసీ కూల్చివేతలు ఇప్పట్లో లేనట్టే ననే సంకేతాలు అధికారులు ఇవ్వడం కొసమెరుపు.

మా ఇంటికి తగ్గ నష్ట పరిహారం ఇవ్వాలి

పదేండ్ల కిందట నేను నా భర్త లేబర్ పని చేస్తూ.. స్థలం కొని 70 గజాల్లో రెండంతస్తుల ఇల్లు కట్టుకొని ఉంటున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మా ఇంటిని పడగొట్టడం అంటే.. మాకు మరణంతో సమానం. ఇన్నేండ్లుగా కష్టపడి కట్టుకున్న ఇల్లు ఎలా వదులుకుంటాం. నా ముగ్గురు పిల్లలతో డబుల్ బెడ్రూంలో ఎలా ఉండాలి. మా ఇంటికి తగ్గ నష్ట పరిహారం ఇవ్వాలి. లేదా మరో ప్రాంతంలో గృహాన్ని కేటాయించాలి.

– బీపిక, దరియాబాగ్ నివాసి.

ఒకే బెడ్ రూంలో మూడు ఫ్యామిలీలు ఎలా ఉంటాయి

నేను 25 ఏండ్లుగా ఈ ప్రాంతంలో ఉంటున్నాను. నాతో పాటు మొత్తం ముగ్గురు అన్నదమ్ములం. అందరం కలిసి 100 గజాల ఇల్లు కట్టుకొని అందులో బతుకుతూ ఏదో ఒక పని చేసుకొని బతుకుతున్నాం. ఇపుడు ప్రభుత్వం మమ్మల్ని బలవంతంగా పంపేసి డబుల్ బెడ్‌రూం ఒక్కటి ఇస్తే మా మూడు కుటుంబాలకు ఎలా సరిపోతుంది?

–ఎం.బాబురావు, దరియాబాగ్

కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీపీ గౌతమ్, బ్లూక్రాస్ ప్రతినిధి అక్కినేని అమల

రేబిస్ ఫ్రీ తెలంగాణగా తీర్చిదిద్దుదాం

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీపీ గౌతమ్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): రేబిస్ ఫ్రీ తెలంగాణగా రూపొందించడానికి కుక్కలకు విధిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. వరల్డ్ రేబిస్ ప్రివెన్షన్ డే సందర్భంగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మిషన్ రేబిస్, డబ్ల్యూవీఎస్, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీపీ గౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ వ్యాధులకు మనుషులు టీకా తీసుకోవడం ఎంత ముఖ్యమో, జంతువులకు వేయించడం కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రధానంగా కుక్కల్లో రేబిస్ ఉంటే అది కరిచినప్పుడు మనుషులకు కూడా వస్తుందని, అందువల్ల కుక్కలన్నింటికి యాంటీ రేబిస్ టీకా తప్పని సరిగా వేయించాలన్నారు. కుక్కలను చంపకుండా వాటి జనాభాను నియంత్రించడానికి యానిమల్ బర్త్ కంట్రోల్ చేయడం ద్వారా వాటిని కంట్రోల్ చేయొచ్చని గౌతమ్ చెప్పారు. 142 మున్సిపాలిటీల్లో సుమారు 2.5 లక్షల కుక్కలు ఉండగా, ఇప్పటివరకు 92 వేల కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామని, మిగతా కుక్కలకు కూడా స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని గౌతమ్ తెలిపారు. బ్లూక్రాస్ సొసైటీ ప్రతినిధి అక్కినేని అమల మాట్లాడుతూ, రేబిస్ నివారణకు కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేయడం, కుక్కల జనన నియంత్రణ చేయడం ఒక్కటే మార్గమన్నారు. 13 రోజులుగా యాంటీ రేబిస్ వాక్సినేషన్ డ్రైవ్ చేపట్టి నాలుగు వేల కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేశామని చెప్పారు. చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్ మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హై లెవల్ కమిటీ సూచనల మేరకు కుక్కల బెడద, కాటు నివారణకు ప్రతి సర్కిల్‌కు రెండు క్యాచింగ్ వాహనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ముగిసిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్

ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌లో ఐటీ రంగ నిపుణులు, ఐఎస్ఎఫ్ ప్రతినిధులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): నగరంలో మూడు రోజుల పాటు జరిగిన ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ సందడిగా జరిగింది. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి స్టార్టప్‌ల వ్యవస్థాపకులు, ఔత్సాహిక వ్యాపార వేత్తలు పాల్గొని ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఉంచిన పలు స్టార్టప్‌లను సందర్శించి, వాటి పనితీరును తెలుసుకున్నారు. ఐటీ రంగ నిపుణులతో పాటు విజయవంతమైన స్టార్టప్‌లను నిర్వహిస్తున్న వ్యవస్థాపకులతో చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌లో భాగంగా 10 అత్యుత్తమ స్టార్టప్‌లను ఎంపిక చేసి వాటికి అవసర మైన ఆర్థిక సహకారం, మెంటరింగ్ కల్పించామని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ చైర్మన్ జేఏ చౌదరి తెలిపారు. ముగింపు కార్యక్రమంలో భారత ప్రభుత్వ మాజీ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.కృష్ణమూర్తి వి.సుబ్రమణియన్, ఐఎస్ఎఫ్ కో ఫౌండర్ డాక్టర్ శివ మహేశ్ టంగుటూరు, సీఓఓ అట్లూరి ఎర్ర గంగు, ప్రతినిధులు ఎం.సత్యేంద్ర కుమార్, శేషాద్రి వంగల, దీన నాథ్ హరపనహళ్లి, బిపిన్ చంద్ర పెండ్యాల, భాను ప్రకాశ్ వర్ల పాల్గొన్నారు.

కేసీఆర్ సారుంటే.. ఈ తిప్పలు వచ్చేవి కావు

కేసీఆర్ సార్ దయతో మాకు షాదీ ముబారక్, రెండు వేల పింఛన్లు, ఉచితంగా రేషన్ బియ్యం వంటి అనేకం ఇచ్చారు. పిల్లి గుడిసెల్లోని మా సొంత ఇంటి జాగాల్లో డబుల్ ఇండ్లు కట్టించి ఇచ్చింద్రు. ఇప్పుడు బయటోళ్లకు ఇండ్లు ఎట్టిస్తరు. కేసీఆర్ సార్ లేకపోవడంతో రేవంత్‌రెడ్డి మాలాంటి పేదోళ్లకు దక్కాల్సిన ఇండ్లను దక్కకుండా చేస్తుండ్రు.

– అమీనా బీ, చంచల్‌గూడ

కిరాయి ఇంట్లో ఎన్ని రోజులుండాలి

డబుల్ బెడ్రూం ఇంటి కోసం దరఖాస్తు చేసి చాలా ఏండ్లయింది. పిల్లి గుడిసెల డబుల్ బెడ్రూం ఇండ్లను ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పడంతో ఎంతో ఆశతో ఉన్నాం. కానీ, మూసీ నిర్వాసితులకు ఇండ్లు ఇవ్వడం చాలా బాధగా ఉంది. మేం ఇన్ని రోజులుగా పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. కొంత మందికే ఇండ్లు ఇవ్వడం ఎంత వరకు కరెక్ట్? ఇస్తే అందరికీ ఇవ్వాలి. కూలీ, నాలీ పనులు చేసుకునే మాలాంటి వాళ్లకు ఎప్పుడు న్యాయం జరుగుతుంది.

– మహ్మద్ షాదాదా ఖురేషీ, (శంకర్‌నగర్)

మాకు డబుల్ బెడ్ రూం ఇల్లు సరిపోదు

200 గజాల ఇల్లు తీసుకొని ఒక్క డబుల్ బెడ్‌రూం ఇచ్చారు. నాకు ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు, అందరం కూలీ పని చేసుకొని బతుకుతున్నాం. మేమంతా కష్టపడి 200 గజాల స్థలం కొని అందులో గుడిసెలు వేసుకొని దాదాపు 15 ఏండ్లుగా జీవిస్తున్నాము. ఇప్పుడు అధికారులు వచ్చి మాఇంటికి గుర్తులు వేసి పొమ్మంటున్నారు. పది మంది కుటుంబం ఉన్న మాకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఎలా సరిపోతుంది?

– జయమ్మ, మూసీ నిర్వాసితురాలు.

ఇంటి అద్దెలు కట్టలేక పోతున్నం.

ఇంటి అద్దెలు కట్టలేక పోతున్నం. డబుల్ బెడ్ రూం ఇండ్లు వస్తే కష్టాలు తీరుతాయని అనుకున్నం. కానీ, మా కండ్ల ముందే బయట వాళ్లకు అధికారులు ఇండ్లు ఇస్తున్నరు. కూలీ నాలీ పనులు చేసుకొని జీవిస్తున్న పేదోళ్లకు ఇండ్లు ఇస్తరని ప్రభుత్వం చెప్పటంతో దరఖాస్తు చేసుకున్నం. మా కాగితాలను అధికారులకు చూపించే అవకాశం లేదు. పోలీసులు మాకు అధికారులను కలిసే అవకాశం ఇవ్వటం లేదు. మాకు ఇండ్లు ఇస్తమని భరోసా ఇచ్చే వారు ఎవ్వరు లేరు. *– పైమిదా, మాదన్నపేట*

మా ఆశలు.. అడియాశలైనయి

ఎన్నో రోజులుగా పిల్లి గుడిసెల డబుల్ బెడ్ ఇండ్లలో మాకు ఇల్లు వస్తుందని ఎంతో ఆశతో ఉన్నం. ఇప్పుడు హైడ్రా బాధితులంటూ మూసీ నిర్వాసితులను ఇక్కడి తెచ్చి ఇండ్లు ఇవ్వటం సరికాదు. స్థానికంగా ఉండే మేము ఎక్కడికి వెళ్లాలి? ఇన్ని రోజులు ఇండ్లు వస్తాయని ఆశతో బతికినం. ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి? ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని ఏండ్లు దాటింది. మేం ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి? మా పరిస్థితిపై ప్రభుత్వం అలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి.

– సలేహా బేగం, చావునీ

సౌదీలో కష్టపడి కట్టుకున్న ఇల్లు

కార్వాన్ దరియాబాగ్‌లో 12 ఏండ్ల కిందట 80 గజాల్లో ఇల్లు నిర్మించుకున్నా. నా భార్య పూజా, ముగ్గురు పిల్లలతో కలిసి సంతోషంగా జీవిస్తున్న సమయంలో యమపాశంలా అధికారులు వచ్చి మా ఇంటికి మార్క్ వేసి వెళ్లిపోవడం అన్యాయం. నేను ఎనిమిదేండ్లు సౌదీలో ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఈ ప్రాంతంలో స్థలం కొని రెండంతస్తుల భవనాన్ని కట్టుకున్నా. ఇప్పుడు మా ఇల్లు లాక్కొని డబుల్ బెడ్రూం ఇస్తాం.. వెళ్లిపోండి.. అని అంటే మేము ఎంతో ఆశపడి కట్టుకున్న ఇల్లును ఎలా వదులుకోవాలి. డబుల్ బెడ్రూం మాకెందుకు, మా ఇల్లు మాకివ్వండి. *– మహేందర్, పూజా దంపతులు*

మూసీ వరదలకు 116 ఏండ్లు

- నాడు ఘోర విపత్తులో 150 మందిని కాపాడిన చింతచెట్టు
- ఫోరం ఫర్ ఏ బెటర్ సొసైటీ చైర్మన్ వేద కుమార్ మణికొండ

చింత చెట్టు వద్ద నిర్వహించిన స్మారక సమావేశంలో మాట్లాడుతున్న వేద కుమార్ మణికొండ

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 28: 1908 సెప్టెంబర్ 28న సంభవించిన వినాశకరమైన మూసీ మహా వరదలకు 116 ఏండ్లు పూర్తయ్యాయని, ఇది హైదరాబాద్ చరిత్రలో ఒక ఘోర విపత్తుగా మిగిలిపోయిందని ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ చైర్మన్ వేద కుమార్ మణికొండ అన్నారు. ఫోరం ఫర్ ఏ బెటర్, సివిల్ సొసైటీ గ్రూప్‌ల ఆధ్వర్యంలో నాటి మూసీ వరదలలో 150 మంది ప్రాణాలను కాపాడిన ఉస్మానియా ఆవరణలోని ప్రాణదాత చింత చెట్టు కింద 16వ స్మారక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన మణికొండ వేద కుమార్ మాట్లాడుతూ, 1908లో మూసీ నది వరదలకు 150 మందికి పైగా ఆశ్రయం కల్పించిన చింత చెట్టు చరిత్రను వివరించారు. వరదల అనంతరం, హైదరాబాద్ 7వ నిజాం 1914లో సిటీ ఇప్రూవ్‌మెంట్ బోర్డు సంస్థను స్థాపించిన హైదరాబాద్ డెక్కన్ 7వ నిజాం నవాబు చేసిన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. ప్రసిద్ధ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన కృషిని స్మరించుకుంటూ మూసీ నదిపై రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించాల్సిందిగా ప్రతిపాదించారని అన్నారు. ఈ రిజర్వాయర్లు వరద ముప్పును తగ్గించడమే కాకుండా నిరంతర తాగు నీటి సరఫరాను దిగువ ప్రాంతాల సేద్యానికి నీటిని అందించాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా దవాఖాన హెచ్‌వోడీ డాక్టర్ జై కిషన్, ఆర్ఎంవో డా. కవిత, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం కన్వీనర్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రమణ నాయక్, ఆర్కిటెక్ట్ మౌనిక, గవర్నమెంట్ సిటీ కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్ దూషి, ఫిల్మ్ మేకర్ రఘు రామ చంద్ర, ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ వీరేశ్ బాబు, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ శ్రీ రామ్ రాజ్, సామాజిక కార్యకర్త ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శోభాసింగ్‌తో పాటు ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, ఎస్ఆర్‌డీ అనాథ విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం వేదికగా అంతర్జాతీయ చాంప్‌లకు కృషి

హైదరాబాద్, ఆట ప్రతినిధి సెప్టెంబర్ 28: హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ చాంపియన్‌షిప్ నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్టు తెలంగాణ ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రతినిధి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. 34వ జూనియర్ జాతీయ త్రోబాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని శనివారం ఆవిష్కరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ తెలంగాణ క్రీడారంగాన్ని విశ్వక్రీడా నగరంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ చాంపియన్ షిప్‌ను రాష్ట్ర రవాణా వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రారంభిప్తారని తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.నవీన్ యాదవ్, కార్యదర్శి జగన్ మోహన్ గౌడ్ వెల్లండించారు. కార్యక్రమంలో మనోహర్ బాబు, కిరణ్ చారి, సహీల్ పాల్గొన్నారు.

స్నూకర్ చాంపియన్ షిప్ న్యూ క్లబ్ సొంతం

హైదరాబాద్, ఆట ప్రతినిధి సెప్టెంబర్ 28: ఇంటర్ క్లబ్ ఇన్విటేషన్ స్నూకర్ టీమ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ది న్యూ క్లబ్ సొంతం చేసుకుంది. లాల్ బహుదూర్ స్టేడియంలోని ఫతేమైదాన్ క్లబ్‌లో శనివారం జరిగిన ఫైనల్స్‌లో అజయ్ 42-65, 35-54, 21-49, 21-51 పాయింట్ల తేడాతో భూషణ్ విభాస్‌పై విజయం సాధించారు. నితేశ్ 44-53, 57-33, 59-18, 40-59 పాయింట్ల తేడాతో వెంకటేశంపై గెలుపొందారు. విశాల్ అగర్వాల్ 57-17, 71-15, 56-12 పాయింట్ల తేడాతో మురళీ న్యూ క్లబ్) పై విజయం సాధించారు. ఫతే మైదాన్ క్లబ్ సభ్యులు సునీతా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, విజయ్ రాజ్, అజయ్ కుమార్ తదితరులు బహుమతులు అందజేశారు.

జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ రెజ్లింగ్ చాంప్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, సెప్టెంబర్ 28: హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించే హైదరాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.జక్కయ్య వెల్లడించారు. ఈ చాంపియన్ షిప్‌ను కార్వాన్ సబ్జీ మండిలో వీర హనుమాన్ వ్యాయామశాలలో నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటల లోపు తమ టీమ్‌లను, ఎంట్రీలను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి గలవారు ఇతర వివరాలకు సెల్‌ఫోన్ నం. 70320 57633లో సంప్రదించవచ్చును.

వయో వృద్ధులను కాపాడుకుందాం..!

- అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): అక్టోబర్ 1న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కిన్నెర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 'వృద్ధులను రక్షించుకుందాం' అనే నినాదంతో ముచ్చింతల్, శంషాబాద్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. 1997, 2007 వృద్ధుల చట్టం, ఉద్దేశం, చర్యల గురించిన సమాచారంపై ఆ ప్రాంతాల సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు, వృద్ధులకు అవగాహన కల్పించినట్టు కిన్నెర వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ నాగ చంద్రికా దేవి చెప్పారు. అన్ని జిల్లాలో వృద్ధుల రక్షణ ప్రాధాన్యతను వివరిస్తామని తెలిపారు. గ్రామాల్లో సిబ్బందికి అవగాహన కల్పించడం ద్వారా వాళ్లంతా మరికొందరికి చెబుతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. అక్టోబర్ 1 వరకు వృద్ధుల వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం, వృద్ధుల సంక్షేమంపై వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారీ ర్యాలీ తీసి ఫ్లకార్డులతో వృద్ధులను గౌరవించుకుందామంటూ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్లు పార్థసారథి, నాగేశ్వర్ రావు, హెల్పేజ్ ఇండియా కో ఆర్డినేటర్ శ్యామ్, పద్మజ పాల్గొన్నారు.

హెచ్ సిటీతో.. మెరుగైన సదుపాయాలు

- కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రూ.826 కోట్లు
- ఆరు చోట్ల జంక్షన్ల అభివృద్ధికి జీహెచ్ఎంసీ కసరత్తు
- మొదటి దశలో రూ.421కోట్లతో పనులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరంలో మౌలిక వసతుల కల్పనకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. కోర్ సిటీలో అత్యంత కీలకమైన కేబీఆర్ పార్కు చుట్టూ నెలకొన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రూ.826 కోట్లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేస్తూ అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టేందుకు డిజైన్లను సిద్ధం జీహెచ్ఎంసీ సిద్ధం చేసింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్ వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్య లేకుండా సిగ్నల్ రహితంగా వెళ్లేందుకు వెలుసుబాటు కల్పిస్తూ ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మొత్తం రెండు దశల్లో కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. అండర్ పాస్‌లలో వర్షపు నీరు లేకుండా నిర్మాణాన్ని డిజైన్ చేశారు. కేబీఆర్ పార్కు చుట్టూ చేపట్టే ఆరు జంక్షన్‌ల నిర్మాణాలతో హైదరాబాద్ ఇమేజ్ మరింత పెరిగేలా డిజైన్లను సిద్ధం చేశారు.

మట్టిలో ఖనిజాలను పరీక్షించే యంత్రం ఆవిష్కరణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): పంటలు సమృద్ధిగా పండాలంటే అందులో ఖనిజాలు సమృద్ధిగా ఉండాలి. భూమిని పరీక్షించకుండా పంటలు వేస్తే ఆశించినంత దిగుబడి రాదు. ఈ నేపథ్యంలో పతంజలి, భరువా అగ్రిసైన్స్ సంయుక్తంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ సహకారంతో 'డాక్టర్ ఆఫ్ ఎర్త్' పేరుతో యంత్రాన్ని రూపొందించారు. ఇప్పటికే 12 రకాల మొక్కలపై దీనిని పరీక్షించామని, మట్టిలో బోరాన్, ఐరన్ ఓర్, మాంగనీస్, కాపర్, తదితర ఖనిజాలను ఈ యంత్రం ద్వారా పరీక్షించవచ్చని భరువా అగ్రి సైన్స్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ ఆచార్య బాలకృష్ణ జీ చెబుతున్నారు. ఇది రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

చిన్నారులకు ఊపిరిపోసిన నిమ్స్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28: వివిధ రకాల గుండె జబ్బులతో జన్మించిన చిన్నారులకు నిమ్స్ వైద్యులు ఊపిరి పోశారు. నిమ్స్, లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్, యూకేకు చెందిన వైద్యుల బృందం సంయుక్తంగా నిరుపేద పిల్లలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్స నిర్వహించారు. 18 మంది పిల్లలకు కొత్త జీవితాన్ని అందించారు. యూకేకు చెందిన పీడియాట్రిక్ సర్జన్, ఆల్డర్ హే చిల్డ్రన్స్ హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ రమణా దన్నపునేని, నిమ్స్ కార్డియోథొరాసిక్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వర రావు నేతృత్వంలో, తెలంగాణ ప్రభుత్వం సహకారంతో 12 మంది వైద్యుల బృందం ఈ నెల 23 నుంచి ఆరు రోజుల పాటు 18 మంది పిల్లలకు శస్త్ర చికిత్స నిర్వహించింది. వైద్యులు, గుండె శస్త్రచికిత్సలు నిర్వహించుకున్న చిన్నారులతో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రమణా దన్నపునేని, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీశ్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రామకృష్ణ, భార్గవి, నర్మద పాల్గొన్నారు.

వరద బాధితులకు సీఎంఆర్ రూ.50 లక్షల సాయం

ఏపీ సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేత

సిటీబ్యూరో, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): వరద బాధితులకు సీఎంఆర్ అండగా నిలిచింది. ఇటీవల విజయవాడను అతలాకుతలం చేసిన బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ రూ.50 లక్షల చెక్కును నారాయణ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు విజయవాడలో అందజేసి, అనంతరం, జ్ఞాపికను అందించారు.

చిన్నారుల హృదయాలకు ఫ్యూర్ చేయూత

చిన్నారులతో కలిసి ర్యాంప్ వాక్ చేస్తున్న హీరో సాయిదుర్గా తేజ్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 28: బంజారాహిల్స్ రోడ్ నం.10లోని రెయిన్‌బో చ